క్లుప్తంగా

కోర్టులో గంగమ్మ ఆలయంలో రాహుకాల పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

మదనపల్లె సిటీ : స్థానిక కోర్టు ఆవరణంలోని కోర్టులో గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు నిమ్మకాయలతో దీపాలు పెట్టి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, బీ.కె.పల్లి భక్తులు పాల్గొన్నారు.

ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



న్యాయవాదులతో చర్చిస్తున్న జడ్జి ఉమార్‌ఫారూక్

తంబళ్లపల్లె : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈనెల 29న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని మండల న్యాయసేవాధికార చైర్మన్, జడ్జి ఉమార్‌ఫారూక్ కోరారు. శుక్రవారం న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇరువర్గాల కక్షిదారులతో చర్చించి రాజీమార్గాన పరిష్కారమయ్యే అవకాశం ఉన్న కేసులు అన్ని పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు, లోక్‌అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి మృతికి కారకులైన వారిని శిక్షించాలి

మదనపల్లె సిటీ : కురబలకోట మండలం అంగళ్లు సమీపంలో చేనేత కార్మికుడు రమేష్‌బాబు మృతికి కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు టి.క్రిష్టప్ప, సాంబశివ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మదనపల్లె తాలూకా ఇన్స్‌పెక్టర్ సద్గురుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలియజేశారు. చేనేత కార్మికుడు రమేష్‌బాబు అప్పుల కారణంగా, అతను కొనుగోలు చేసిన స్థలాన్ని తనకు ఇవ్వలేదని కారణాలతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. ఈ కేసులో పోలీసులు సమగ్ర విచారణ చేసి మృతికి కారకులైన వారిని అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయుసి పట్టణ కార్యదర్శి తిరుమల, సీపీఐ నాయకులు చంద్రశేఖర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ కల్పన

వాల్మీకిపురం : స్థానిక డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ కల్పన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 25వ తేది వరకు దరఖాస్తులు పాఠశాలలో స్వీకరించబడుతాయని, దరఖాస్తు చేసుకోదలచిన వారు నేరుగా పాఠశాలలో సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 27న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 7989128742, 8331823512, 9010223222లను సంప్రదించాలని ఆమె సూచించారు.

అలరించిన అర్జున తపస్సు



పీలేరులో అర్జున తపస్సుమాను వద్ద జన సందోహం

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిర్వహిస్తున్న పంచమ వేద మహాభారత యజ్ఞం నాటక ప్రదర్శనలో భాగంగా శుక్రవారం ప్రధాన ఘట్టమైన అర్జున తపస్సు మాను అధిరోహణ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ముందుగా ఏర్పాటు చేసిన తపస్సుమాను వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్జున వేషధారి శివనామస్మరణ భక్తి గీతాలాపన చేస్తూ తపస్సు అధిరోహించారు. అక్కడ తపస్సు ఆచరించిన అనంతరం పుష్పాలు, మిఠాయిలు, నిమ్మకాయలు అక్కడి నుంచి భక్తులకు అందజేశారు.

వారపు సంత వేలం

ములకలచెరువు : మండలంలోని చౌడసముద్రం వారపు సంతకు శుక్రవారం వేలం నిర్వహించారు. ఈ నేపథ్యంలో 54,400లకు హెచ్చు పాటాదారుడైన విశ్వనాథ్ నాయుడు వేలం దక్కించుకున్నాడు. ఈ వేలంలో ఎంపీడీవో పోలప్ప, సర్పంచ్ రాంబాబు నాయుడు, కార్యదర్శి ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం

ఊరూరా యోగా దినోత్సవ వేడుకలు



మదనపల్లె : యోగాసనాలు వేస్తున్న జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు



నిమ్మనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



గుర్రంకొండ : యోగాసనాలు చేయిస్తున్న ఉపాధ్యాయులు



రామసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



వాల్మీకిపురంలో.. పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



కురబలకోట : విద్యార్థుల యోగాసనాలు



కలికిరి : యోగాసనాలు సాధన చేస్తున్న జేఎన్టీయూ విద్యార్థులు



బి.కొత్తకోట : యోగా డే ఆంగ్ల అక్షరాలతో కూర్చున్న ఆదర్శ విద్యార్థులు



మదనపల్లె : యోగాసనాలు వేస్తున్న ఆదిత్య కాలేజీ విద్యార్థులు



పీలేరు : యోగాసనాలు చేస్తున్న దృశ్యం



వాల్మీకిపురం : యోగాసనాలు చేస్తున్న వైద్య సిబ్బంది



కేవీపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో..

మదనపల్లె సిటీ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. మదనపల్లె పట్టణంలో శుక్రవారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు యోగా సనాలు వేశారు. నిత్యం ఒత్తిడితో ఉన్నప్పుడు యోగా చేయడం ఎంతో ఉపయోకరంగా ఉంటుందన్నారు. విద్యార్థి దశ నుంచి యోగా నేర్చుకోవాలన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శివపార్వతి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ రెడ్డప్పరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో యోగా ట్రైనర్ రాజేంద్ర విద్యార్థులకు యోగా ఆసనాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు పాల్గొన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో యోగా దినోత్సవం పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగా మానసిక, శారీర ఆరోగ్యానికి చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మోహన్‌వల్లి, జ్యోతి, గురుమూర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు. చంద్రకాలనీలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో యోగ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులచే యోగసనాలు సాధన చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వసుంధరాదేవి, సీఎస్‌సీ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక ఎన్జీవో హోం నందు యోగా దినోత్సవం జరుకున్నారు. అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లీనాకుమారి పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

నిమ్మనపల్లె : యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని తహసీల్దార్ బాలాజీరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ కాలేజీ, జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. యోగాతో లభించే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో యోగా సనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షాలెట్, ప్రిన్సిపాల్ శ్రీధర్, హెచ్‌ఎం అంజాద్‌అలీఖాన్, ఎంఈఓలు నారాయణ, పద్మావతి పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం : రామసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థుల చేత యోగాసనాలు వేయించి యోగా ప్రాముఖ్యతను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగరాజ తెలియజేశారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయడం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి సత్యనారాయణస్వామి, అధ్యాపకులు రవి, శివ, చిరంజీవి, భవాని, లక్ష్మీ, వేదవతి, దశరధరామిరెడ్డి, దీప్తి పాల్గొన్నారు.

యోగాతో వ్యాధి నిరోధక శక్తి

పీలేరు : యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యోగా మాస్టర్, షీ సంస్థ అధ్యక్షురాలు పి.వి.ఎస్. లక్ష్మీ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురష్కరించుకుని స్థానిక షీ దివ్యయోగా విద్యాలయంఆధ్వర్యంలో ఆర్యవైశ్య కల్యాణ మండలంలో అంతర్జాతీయ యోగ దినోత్సవ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాతో మెదడుకు, ఆత్మకు ఉత్సాహం, ఉల్లాసం కల్గించడం తోపాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. వృద్ధాప్య సమస్యలు దూరమవుతాయని, మతిమరుపు, నిద్రలేమి, మధుమేహం తదితర ఆరోగ్య సమస్యలు అదుపులో ఉంచుతుందని తెలిపారు. అనంతరం యోగా శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వా స్పత్రి సూపరింటిండెంట్ చంద్రశేఖర్, డాక్టర్ ఈశ్వరసురేంద్ర, డాక్టర్ దినేష్‌రెడ్డి, వివిఎస్ మాధవి, డాక్టర్ రాయల సుధాకర్ పాల్గొన్నారు.

గుర్రంకొండలో ..

గుర్రంకొండ : మండలకేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో యోగా ఇన్స్‌పెక్టర్ హిదాయతుల్లా ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఈవో సుబ్రమణ్యం,ఆయుర్వేద వైద్యులు సయ్యద్ ఖాదరిలు మాట్లాడుతూ ప్రపంచంలో యోగాకు పునరుత్తేజాన్ని తీసుకొచ్చిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి దక్కుతుందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని అన్ని దేశాల్లో యోగా విస్తరించిందన్నారు. ప్రతిరోజూ యోగా చేయడం వలన మనిషి ఎంతో ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సురేంద్రబాబు, పీడీ రమేష్, ఉపాధ్యాయులు మదన్మోహన్, రెడ్డిమోహన్,తినాధరావ్, జావీద్‌లు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో..

కలికిరి : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గ్యారంపల్లి యోగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత ఆహారపు అలవాట్లు, వాతావరణం దృష్ట్యా వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరు యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. యోగాతోనే మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు యోగా

వాల్మీకిపురం : ప్రతి ఒక్కరూ యోగాపై అవగాహన పెంచుకొని, సాధన ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాభ్యాస్యం ద్వారా మంచి ఆరోగ్యం అలవడుతుందని, కొన్ని రకాల వ్యాధులను కూడా జయించవచ్చునన్నారు. పని ఒత్తిడిని కూడా అధిగమించవచ్చన్నారు. అలాగే స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సావిత్రి యోగా దినోత్సవాన్ని నిర్వహించి, విద్యార్థులతో ఆసనాలు వేయించారు. అలాగే జర్రావారిపల్లి పంచాయతీ వడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎంఎల్‌హెచ్‌పి మౌనిక విద్యార్థులతో ఆసనాలు చేయించారు. అలాగే స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీదేవి విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉమాదేవి, వసుంధర, సుధారాణి, శోభారాణి, అనురాధ, పుష్పలత, నాగసునిత, రాధిక, సుధాకర్, బాబాఫకృద్దిన్ పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం

కేవీపల్లె : యోగా సాధన చేయడం ద్వారా శారీరక, మానసికోల్లాసం లభిస్తుందని ఎంఈఓ రెడ్డిబాషా అన్నారు. శుక్రవారం మండలంలోని కేవీపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల యోగా సాధన చేపించారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి యోగ పట్ల ఆసక్తి చూపాలని సూచించారు. యోగాతో ఏకాగ్రత లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలాజి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య దశ నుంచి యోగాను అలవర్చుకోవాలి

కురబలకోట : బాల్య దశ నుంచి యోగాను అలవర్చుకోవాలని అంగళ్లులోని గోల్డన్‌వ్యాలీ విద్యా సంస్థల అధినేత ఎన్వి రమణారెడ్డి అన్నారు. శుక్రవారం యోగా డేని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం, శ్వాస, జ్ఞాపక శక్తి మెరుగవుతుందన్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ప్రిన్సిపాల్ గోపాల్ నాయక్, ఎన్ఎస్ఎస్ పీఓ చిన్న వెంకటేశు యోగా గురించి విద్యార్థులకు వివరించారు. ఆదర్శ విద్యాలయం, కేజీబీవీల్లో విద్యార్థులతో ఆసనాలు వేయించగా ఆదర్శ విద్యార్థులు యోగా డే ఆంగ్ల అక్షరాలతో కూర్చుని ప్రదర్శన నిర్వహించారు. ఎంఈవో రెడ్డి శేఖర్, ప్రిన్సిపాళ్లు శీనూ నాయక్, విశ్వలత మాట్లాడుతూ యోగా నిత్యం చేయడంవల్ల విద్యార్థుల్లో మానసిక స్థైర్యం పెరుగుతుందన్నారు.

ఆరోగ్యాన్ని బోధించే సజీవ శాస్త్రం 'యోగా'

పెద్దమండ్యం : మనిషికి ఆరోగ్యాన్ని బోధించే సజీవ శాస్త్రం 'యోగా' అని కలిచెర్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అమరేంద్రకుమార్ అన్నారు. కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనిషికి ఆరోగ్యాన్ని బోధించే సజీవ శాస్త్రం 'యోగా' అన్నారు. యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఎ యోగా తో విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందించు కోవచ్చన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

తంబళ్లపల్లె : యోగాతోనే మానసిక ప్రశాంతత, దేహధారుడ్యంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని యోగా మాస్టర్ సిద్దారెడ్డి తెలిపారు. మండలంలో అన్ని పాఠశాలల్లోను శుక్రవారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, టీచర్లు, పీడీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నిమ్మనపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంఈఓలు పద్మావతి, నారాయణ అన్నారు. శుక్రవారం మండల స్థాయి అధికారుల బృందం 'నేను బడికి పోతా' కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ నిమ్మనపల్లెలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బందితో పాటు అధికార యంత్రాంగం గ్రామాల్లో పర్యటించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలాజీరాజు, ఎంపీడీఓ షాలెట్, ఏపీఎం రజని, హెచ్‌ఎం అంజాద్‌అలీఖాన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భానులక్ష్మిదేవి పాల్గొన్నారు.

ముగిసిన గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షలు

కలికిరి : జిల్లాలోని మహాత్మా జ్యోతిరావుపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలల్లో 7, 9వ తరగతులలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఏపీఎంజేపీ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ తెలిపారు. కలికిరి పాఠశాలలో జరిగిన పరీక్షలలో 7వ తరగతికి 246 మంది దరఖాస్తు చేసుకుని ఉండగా 184 మంది, 9వ తరగతికి 143 మంది దరఖాస్తు చేసుకుని ఉండగా 110 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు ఆయన తెలిపారు.

మీసేవ కేంద్రంలో రికార్డుల పరిశీలన



మీ సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

కలికిరి : ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రెండు మీ–సేవా కేంద్రాలను మదనపల్లి డీఎల్‌డీఓ లక్ష్మీపతి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. నిర్వహణపై సూచనలిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన స్థానిక ఎంపీడీఓ రామక్రిష్ణయ్యతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ–సేవ కేంద్రంలో అందుబాటులో ఉండే సేవలలో ఏలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్వహించాలి. ప్రభుత్వం నిర్ణయించిన ధరలనే ప్రజల నుంచి వసూలు చేయాలి, సర్టిఫికెట్‌లకు సంబంధించి స్టాకు రిజిస్టరు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజల వద్ద ఎక్కువ ఫీజులు వసూలు చేసినట్లయితే చర్యలు తప్పవన్నారు.

పాఠశాలల వేళకు బడి బస్సులు

- విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు
- ఆర్టీసీ డీఎం మూరే వెంకటరమణారెడ్డి



మదనపల్లె సిటీ : వేసవి సెలవుల అనంతరం ఇటీవలే పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. మదనపల్లె-1, 2 డిపో పరిధిలో విద్యార్థులు ఇబ్బందులు రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె-1 డిపో పరిధిలో బి.కొత్తకోట పరిధిలోని గ్రామాలకు రెండు సర్వీసులు, మదనపల్లె-బి.కొత్తకోట ఒక సర్వీసు, మదనపల్లె-ముద్దలదొడ్డి ఒక సర్వీసు, మదనపల్లె- కోసువారిపల్లె ఒక సర్వీసు, మదనపల్లె-మిట్టామర్రి ఒక సర్వీసు, మదనపల్లె-గొళ్లపల్లెకు ఒక సర్వీసు నడుపుతున్నామన్నారు. దీంతో పాటు ఆయ రూట్లలో వెళ్లే బస్సుల్లో విద్యార్థులు కూడా బస్సులో ప్రయాణం చేయవచ్చునన్నారు. మదనపల్లె -2 డిపో పరిధిలో మదనపల్లె-కలిచెర్ల, వాల్మీకిపురం-కదిరినాథునికోట, మదనపల్లె-ఆవులపల్లిలకు బడి బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. బస్సు సౌకర్యం ఉన్న ప్రతి గ్రామానికి విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల వేళలకు బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. అవసరమైతే ఎక్స్‌ప్రెస్ బస్సులను రూట్ మార్పు చేసి బడి పిల్లలకు మొదట ప్రాధాన్యత ఇస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు వాహనాలు, ఆటోలలో ప్రయాణించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థ అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు



మదనపల్లె సిటీ : పౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం మదనపల్లె వన్ డిపో నుంచి రెండు ప్రత్యేక బస్సులు తిరువణ్ణామలైకి వెళ్లాయి. భక్తుల కోసం రెండు ఆల్ట్రా డీలక్స్ బస్సులు నడిపారు. వచ్చే నెల 20న గిరి ప్రదక్షిణ కోసం అరుణాచలానికికు ప్రత్యేక బస్సులు నడుపుతామని డీఎం వెంకటరమణారెడ్డి తెలిపారు.

పంచాయతీ అక్రమాలపై విచారణ జరిపించండి



డీఎల్‌పీఓకు ఫిర్యాదు చేస్తున్న వార్డు సభ్యులు

పీలేరు : పీలేరు మేజర్ పంచాయతీలో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరుతూ పంచాయతీ వార్డు సభ్యులు డీఎల్‌పీవో నాగరాజుకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం డీఎల్‌పీఓకు వార్డు సభ్యులు కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో గత 10 నెలలుగా ఇన్‌చార్జ్ సర్పంచ్ జీనత్‌షఫి, ఈఓ గఫూర్‌లు 15 ఆర్థికసంఘం నిధులకు సంబంధించి, జనరల్ ఫండ్, బిల్డింగ్ అప్రూవల్స్ మొదలగు వాటి గురించి తమకు ఎటువంటి సమాచారం ఇవ్వడంగానీ, చర్చిండం చేయటం లేదన్నారు. కనీసం జనరల్‌బాడీ మీటింగ్‌లో కూడా చర్చించకుండా ఏక పక్షంగా నిర్ణయం తీసుకొంటున్నారని ఫిర్యాదు చేశారు కార్మికులకు ఇవ్వవలసిన ఈపిఎఫ్ డబ్బులు కూడా ఇవ్వలేదన్నారు. పంచాయతీలో 20 మందిని అనధికారికంగా కార్మికులకుగా నియమించుకొని ఇష్టానుసారంగా జీతాలు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఈనెల ఏడవ తేదిన పంచాయతీ అత్యవసర సమావేశం నిర్వహించామని ఎంపీడీఓకు పంపిన లేఖలో ఎంత మాత్రం నిజం లేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తేవాలని వారు కోరారు.

మదనపల్లెను జిల్లాగా ప్రకటించాలి

మదనపల్లె సిటీ : మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మైఫోర్సు మహేష్ రాష్ట్రర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను కోరారు. శుక్రవారం ఆయన సచివాలయంలో కలిసి పుష్పంగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కడప టు బెంగుళూరు రైల్వే లైను, హార్సిలీహిల్స్ పర్యాటక అభివృద్ధి చేయాలని కోరారు. జిల్లా పర్యటనకు రావాలని కోరారు.